# ఖరీదు లేని క్షణం

నేను వూళ్లో దిగి, తిరిగి తాడు వదిలిన బొంగరంలా నిరర్థకంగా తిరుగుతున్నానని చూసి కొందరూ, విని కొందరూ గబగబా నిలదీసి, నిక్షేపంలాంటి వుద్యోగం ఎందుకు కాలదన్నేవు? ఏం బావుకుందామని వచ్చీ సేవు, అని అడగడం ఆరంభిచేరు.

వీళ్లకీ తెలీదు..

చెప్పినా అర్థం అవదు..

నేను చెప్పే కారణం గ్రహించగల తీరిక వీళ్ళకి లేదు. ఎంత తీరిక తక్కువగా తిరుగుతారో వీళ్ల అంత ఘనీభవించినవి వీళ్ల జీవన పంథాలు! లభ్యమయిన అరలిప్త మాత్రపు అలౌకికానం దానుభూతి కోసరం ఆ వుద్యోగం లేదా; వూడిగం చేసేను.

అది, పిడికిలి బిగించినప్పటికీ ఏవేలి సందులో నించో జారిపోయిన పాదరసం లాగ జారిపోగానే, నిలువలేక పారిపోయివొచ్చేసేను.

ఇప్పుడు మాత్రం నేను తప్పించుకోడం, వెతుక్కోడం అనే రెండు తప్పనిసరి పట్టాలమీద నడుస్తున్నాను.

నేను పనిజేసింది ఒక క్వారీలో. అక్కణ్ణించి నరాలు తోడుకుపోతూ, కూలీలుతోడే రాళ్లను రవాణా చేయించడం, పగలు రాళ్ల పగిలే యెండలో మండడం రాత్రిళ్ల కండలు కరిచే చలిలో కొరడు బారడం. నేను చేసేపని. ఆ సంగతి వీళ్ళకి తెలియదు. వీళ్లకీ జీతంరాళ్ల సంగతి మాత్రం తెల్సును!

నిత్యమూ సాయంత్రం వేళ ఒక చిన్న రైలు నన్ను అంటే మమ్మల్ని మోసుకుపోయి, మా 'యిల్లు' అనే వసతి కొంపలకీ, మళ్ళీ వుదయం అక్కణ్ణించి, క్వారీకి లాక్కుపోయేది.

మధ్యలో యీ రైలు ఆగేది. అదీ ఒక మట్టి దిబ్బమీద. దాని చుట్టూ ఫెన్సు వొకటి కట్టేరు. దాని మీద ఒక నీళ్ల కొళాయి వుంది. మిగతాదంతా ప్రకృతి, అంటే తెలుగులో అడవి.

దాన్ని వాళ్లు ఒక నామకరణం చేసి పిల్చినా మా వాళ్లందరూ స్టేషను అనేవారు. నేను

రెండూఅనుకొనేవాణ్నిగాదు.

ఇక్కడ రైలు ఆగడం అరక్షణం. కీచుకీచుమంటూనే ఆగి ఝుక్ ఝుక్ మంటూ మళ్లీ కదుల్తుంది.

ఇది నా స్వర్గం. నా నందనవనం! ఆ కొళాయిదిమ్మ నాకు పూలమొక్క. ఆ పూల మొక్కని వంగి మూర్కొనే సంధ్యకాంత అలాగని విని, ఓ పిల్లది నీళ్ల పట్టుగుంటూంది అక్కడ అంటారు మిత్రులు. కాని ఆ పిల్లది కలువ కాడలాంటి చిన్నది . నా యీ నందనోద్యానవనంలో నావనలక్ష్మి.

అరలిప్తలో సంధ్యకాంతిలా కనుమరుగైపోయే ఆ దృశ్యం నాకు యుగానుభూతి ఉదయం నించి సాయంత్రందనుక అది నా అవయావాలలో విద్యుత్ లా ప్రవహిస్తూ, నా చేత కటిక చాకిరీ చేయించగల అద్భుతమైన పులకింత!

సరిగ్గా తిరిగి 'అసలు సంధ్య వేళ' నా దేవత సందర్శనం. దాంతో మంత్రం వేసినట్లు నా బాధలన్నీ హరిస్తాయి.

వనలక్ష్మిని వర్ణించడానికి అలంకారాలు లేవు. ఆ పోలికలున్నా మీకు చూపెడుదును. ఆమె ఆమే...అలా గా పోతే నేనా కటిక చాకిరీ చేసేవాడ్నేగాదు!

ఆమెకు, నాకు యివ్వగలిగిన అరలిప్త కాలపు మనోజ్ఞమూర్తి సందర్శనంకంటే వ్యక్తిత్వం లేదు. కాని ఉదయాస్తమయాలు అవకపోయినా నేమ ఆడగను. ఈ అరక్షణం నాకు యివ్వండి మీ క్వారీలు మరి నాలుగింటిలో రోజుకి వలభై యెన్మిది గంటలు చేయండి. చాకిరీ చేస్తాను అంటాను.

దుర్మార్గులు క్వారీ దగ్గర కొంప ఒకటి గట్టి-దేనికోసమైతే నా హృదయంలో ఎర్రని రక్తాన్ని నిర్మలంగా జేసుకుని నా నరాలకీ తోడుతున్నానో, ఆకాశాన్ని తాగే కళ్లతో ఎదురుచూస్తున్నానో. ఆ నా మధుర క్షణాన్ని, నా స్వర్గాన్నీ జీవితాన్నీ నమిలివేసేరు.

క్వారీలో రాళ్లన్నీ నా వ్యధకి మూగ భాషలో విలపించేయిగాని అధికారులు మాత్రం నాకూ, నా స్వర్గానికీ మధ్య పట్టాలు చెరిపేసేరు.

ఆ రైలూ, ఆ స్టేషనూ అవసరం లేదని నిక్షేపంలాంటి బంగారు బొట్టును చెరిపేసుగొనే చంటిపిల్లాడిలా చెరిపేసేరు.

అందుకే పారిపోయొచ్చేసేను. ఆ అరలిప్త కోసరం అంత మంచి వుద్యోగం వదులుకున్న 'అవివేకి' నట నేను అందరూ అంటారు. ఆ క్షణం కోసరం అసలు అంతచెడ్డ వుద్యోగం చేసేను కాని ... లేకపోతేనా?.... అంటాను నేను.

**(1959, హంస, 1990 సిరివెన్నెల )**